ప్రజాశక్తి
ఆదివారం 25, డిసెంబర్ 2022
5
అనంతపురం



అథ్లెటిక్ మీట్‌లో పతకాల పంట

అనంతపురం : శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాలల అథ్లెటిక్ స్పోర్ట్స్ మీట్‌లో శ్రీబాలాజీ విద్యాసంస్థల విద్యార్థులు పతకాల మోత మోగించారు. ఈమేరకు అనంతపురంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో పతకాల ప్రదానోత్సవంలో వారు పతకాలు అందుకున్నారు. అనంతపురంలోని పివికెకె పీజీ కళాశాలకు చెందిన బాలసాయి 400 మీటర్లలో పరుగులో బంగారు పతాకం, 1500 మీటర్స్‌లో రజతం సాధించగా, ముదిగుబ్బ ఎస్‌డిఆర్‌అర్ కళాశాలకు చెందిన ప్రత్యూష 100 మీటర్స్, 200 మీటర్స్, లాంగ్ జంప్, షాట్ పుట్ విభాగాల్లో నాలుగు బంగారు పతకాలు సాధించినట్లు తెలిపారు. కాగా ఈ ప్రదానోత్సవంలో కళాశాల ప్రతినిధులుగా ప్రిన్సిపల్ వై.మునికృష్ణారెడ్డి, కళాశాల ఎఒ ధనుష్, సూపర్‌వైజర్ రమణ హాజరై విద్యార్థులతోపాటు పతకాలు అందుకున్నారు. పతకాలు సాధించిన విద్యార్థులను ఎస్.కే యూనివర్సిటీ స్పోర్ట్స్ కమిటీ సెక్రటరీ శ్రీనివాస్, బాలాజీ విద్యాసంస్థలు అధినేత పల్లె రఘునాథ్‌రెడ్డి, ఛైర్మన్ పల్లె కిషోర్, యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి అభినందించారు.



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సాంకేతికతను అందిపుచ్చుకోగలిగితే వినియోగదారులు ఉన్నచోటునుంచే తమ హక్కులు సాధించుకోగలరలని జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్ అన్నారు. జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన 12 శాఖల పరిధిలోని సమస్యలపై ఫిర్యాదులు చేసే అవకాశం కల్పించే 'ఆరోగ్య అనంతపురము' యాప్‌ను జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్ శనివారం లాంచ్ చేశారు. స్థానిక కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో జాతీయ వినియోగ దారుల దినోత్సవం సందర్భంగా జిల్లా పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారుల హక్కులు కాపాడేందుకు అవసరమైన వ్యవస్థలను ఏర్పాటు చేయడం, ఇప్పటికే ఉన్న వ్యవస్థలను పతిష్టపరచడం నిరంతర ప్రక్రియలా కొనసాగుతుందన్నారు. సాంకేతికతను అందిపుచ్చుకోగలిగితే వినియోగదారులు ఉన్నచోటునుంచే తమ హక్కులు సాధించుకోగలరన్నారు. వినియోగ దారుల ఉద్యమం కేవలం ప్రయివేటు సంస్థల నుంచి కొనుగోలు చేసే వస్తు సేవలకు మాత్రమే పరిమితం కాకూడదన్నారు. ప్రభుత్వాలు పౌరులకు అందించే సేవలలో సైతం నాణ్యత పెరిగేందుకు దోహదం చేసిన మహోన్నత ఉద్యమం అన్నారు. జిల్లా పౌరుల హక్కుల కోసం జిల్లా అధికార యంత్రాంగం 'ఆరోగ్య అనంతపురము' యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. అనంతరం జిల్లాలో వినియోగదారుల హక్కులపై నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో విజేతలకు జాయింట్ కలెక్టర్ ధ్రువపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఎస్ఒ శోభారాణి, లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ స్వామి, ఫుడ్ కంట్రోలర్ కల్యాణ్ చక్రవర్తి, వినియోగదారుల కమిషన్ సభ్యులు గోపీనాథ్, సివిప్ సప్లైస్ డిఎం నీలమయ్య, ఇంటర్మీడియట్ విద్య డివిఇఒ వెంకటరమణ నాయక్, ఎపిఎస్‌ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సుమంత్, డీసీఐసీ ప్రెసిడెంట్ రవీంద్రనాథ్ రెడ్డి, వినియోగదారుల పరిరక్షణ సమితి రీజినల్ మెంబర్ నబీరసూల్, జిల్లా వినియోగదారుల సంఘాల సమాఖ్య ఉపాధ్యక్షులు చల్లా కిశోర్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

భయం వీడితే విజయం మీదే..:దిశా డీఎస్పీ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్



మాట్లాడుతున్న దిశా డీఎస్పీ ఆర్ల శ్రీనివాసులు

పోటీ పరీక్షలు అంటే భయం వీడి చదివితే విజయం మీదే అని దిశా డిఎస్పీ శ్రీనివాసులు సూచించారు. భారత ప్రజాతంత్ర యువజన సమైక్య (డివైఎఫ్ఐ) జిల్లా అధ్యక్షులు బాలకృష్ణ అధ్యక్షతన శనివారం స్థానిక సాయిగంగా కోచింగ్ సెంటర్‌లో ఎస్ఐ, కానిస్టేబుళ్లు, డీఎస్సీ శిక్షణ తీసుకునే అభ్యర్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీ పరీక్షల్లో ఎంతమంది పోటీ పడుతున్నారు, ఎన్నిపోస్టులు ఉన్నాయి, ఇలాంటివి ఆలోచించకుండా ఒక్క పోస్ట్ ఉన్న అది నాదే అనే విశ్వాసం, నమ్మకంతో పరీక్షలకు సిద్ధపడాలన్నారు. మన లక్ష్యం కచ్చితంగా ఉద్యోగం సంపాదించానే తపనతోపాటు కష్టపడే తత్వం అలవాటు చేసుకోవాలన్నారు. దీనికోసం ఒక ప్రణాళిక రూపొందించుకుని చదువుకోవాలన్నారు. ముఖ్యంగా కరెంట్ అఫైర్స్, జనరల్ నాలెడ్జ్‌పై ఎక్కువ దృష్టి సారించాలన్నారు. దీనికోసం ప్రత్యేక స్టడీ మెటీరియల్‌తో పాటు వార్తాపత్రికలను రోజూ చదువుతూ ఉండాలన్నారు. అందుబాటులో ఉన్న గ్రంథాలయాలను ఉపయోగించుకోవాలన్నారు. అలాగే ఉద్యోగం పేరుతో దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. కేవలం స్వయంకృషిని నమ్ముకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహారెడ్డి, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి తరిమెల గిరి, సాయిగంగా కోచింగ్ సెంటర్ డైరెక్టర్ జగదీష్‌తో పాటు అభ్యర్థులు పాల్గొన్నారు.

బదిలీల ప్రొవిజినల్ సీనియారిటీ లిస్ట్ విడుదల

అనంతపురం సిటీ : ఉపాధ్యాయుల బదిలీల ప్రొవిజినల్ సీనియారిటీ లిస్టును శనివారం విడుదల చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి యం.వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. ఈ లిస్టుపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 25 సాయంత్రం 5గంటలలోపు ఆన్‌లైన్ ద్వారా సమర్పించాలన్నారు. స్పోజ్, ప్రిఫరెన్స్, ఎల్.కేటగిరీలు, స్పెషల్ కేటగిరీలు, పాయింట్ల వినియోగంలో ఏమైనా తప్పులు ఉంటే గుర్తించినట్లు అయితే క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

శాశ్వత భవనంలోకి రక్షక్ ప్రీ స్కూల్ మార్పు

అనంతపురం కలెక్టరేట్ : పోలీసు పిల్లల కోసం జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లోని డిటిసిలో తాత్కాలికంగా నిర్వహిస్తున్న 'రక్షక్ ప్రీ ప్రైమరీ స్కూలు'ను ఎస్పీ ఫక్కీరప్ప శనివారం శాశ్వత భవనాల్లోకి మార్చారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కార్పొరేట్ విద్యా సంస్థలకు ధీటుగా సకల సౌకర్యాలు, సాధనాలతో తరగతి గదులు, చిల్డ్రెన్ ల్యాబ్‌లను తీర్చిదిద్దినట్లు తెలిపారు. ఉన్నత విద్యా ప్రమాణాలు కల్గిన టీచర్లు, తదితర సిబ్బందిచే స్కూలు నిర్వహణ కొనసాగించనున్నట్లు తెలిపారు. కాసేపు స్కూలు పిల్లలతో ఎస్పీ ముచ్చటించి ఆనందాన్ని వ్యక్తం చేశారు. టీచర్ తరహా వ్యవహరించి పిల్లల నుండి ప్రశ్నలకు సమాధానాలు రాబట్టారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఇ.నాగేంద్రుడు, హనుమంతు, స్పెషల్ బ్రాంచి సిఐ చక్రవర్తి, ఆర్ఎస్ఐలు రాజశేఖర్‌రెడ్డి, ప్రదీప్ సింగ్, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్ నాథ్, సుధాకర్ రెడ్డి, తేజ్ పాల్, శ్రీనివాసుల నాయుడు, ఆనందబాబు, సరోజ, తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ జోడో యాత్రను ఆపడానికి బిజెపి కుట్ర

ఉరవకొండ : రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడోయాత్రకు దేశవ్యాప్తంగా ప్రజల నుంచి వచ్చిన విశేష స్పందన చూసి ఓర్వలేని బిజెపి ప్రభుత్వం ఆపడానికి కుట్ర పన్నుతోందని జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి సోనియా శీన ఆరోపించారు. శనివారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కరోనా సాకుతో జోడోయాత్రను ఆపడానికి బిజెపి ప్రభుత్వం కుట్రలు చేయడం శోచనీయమన్నారు. రాహుల్ యాత్ర వల్ల కేంద్రంలో బిజెపి ప్రభుత్వం పతనం ఖాయమని భావించి కుట్ర చేస్తున్నారన్నారు. బిజెపి అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక, విచ్ఛిన్నకర, విద్వేషపూరిత అంశాలను రాహుల్ గాంధీ ప్రస్తావిస్తూ ప్రజల్లో చైతన్యం కలిగిస్తున్నాడన్నారు. వీటిని బిజెపి ఏమాత్రం జీర్ణించుకోలేకపోతోందని విమర్శించారు. రాహుల్ యాత్ర ఢిల్లీ, కాశ్మీర్‌లో కొనసాగితే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి గడ్డ పరిస్థితులు ఎదురవుతాయన్నారు. ఈ విషయం తెలిసే ఎలాగైనా యాత్రను ఆపడానికి సాకులు వెతుకుతున్నారన్నారు. కర్ణాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో రాహుల్ జూడో యాత్రకు విశేష స్పందన లభించిందన్నారు. యాత్రను ప్రచారం చేయకుండా కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం మీడియాను సైతం తమ గుప్పెట్లో పెట్టుకుందన్నారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో రాష్ట్రమంత్రులు, ముఖ్యమంత్రులు అనేక బహిరంగ సభలు, యాత్రలు, ఎన్నికల ప్రచారాలు నిర్వహిస్తున్నారని, వారికి కరోనా నిబంధనలు వారికి వర్తించవా.. అని ప్రశ్నించారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో డిసిసి సభ్యులు అబ్బాస్, కాంగ్రెస్ పార్టీ ఉరవకొండ మండల కన్వీనర్ ఇంద్రావతి ఓబులేసు, తదితరులు పాల్గొన్నారు.

కెజిబివిలో ఏం జరుగుతోంది..?

శింగనమల మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో విద్యార్థినులకు నెల రోజుల్లో రెండు సార్లు ఫుడ్ పాయిజన్ జరగడంతో అసలు అక్కడ ఏం జరుగుతోందన్న ప్రశ్న తలెత్తుతోంది. కెజిబివిలో సిబ్బంది మధ్య ఆధిపత్య పోరు వల్లే సంఘటనలు చోటుచేసు కుంటున్నాయన్న వాదనలూ వినిపిస్తున్నాయి. దిగువ స్థాయి సిబ్బంది గొడవపడే దృష్యాలు ఇటీవల సోషల్ మీడియాలో వైరల్ కావడం దీనికి బలంచేకూరుస్తోంది. కెజివివిలో సమగ్ర శిక్ష అధికారుల పర్యవేక్షణ లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోందన్న విమర్శలూ వినిపిస్తున్నాయి. దీంతో తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారు.

- శింగనమల కస్తూర్బా పాఠశాలలో నెలలో రెండు సార్లు ఫుడ్ పాయిజన్
- బల్లి పడిందా..వేశారా..?
- సిబ్బంది మధ్య ఆధిపత్య పోరు
- భయాందోళనలో తల్లిదండ్రులు



శింగనమలలోని కెజిబివి జూనియర్ కళాశాల

ప్రజాశక్తి-శింగనమల

శింగనమల కెజిబివి జూనియర్ కళాశాలలో 253 మంది విద్యార్థినులు విద్యను అభ్యసిస్తున్నారు. నెల రోజుల్లో రెండు సార్లు ఫుడ్ పాయిజన్ జరగడంపై సర్వత్రా చర్చ నడుస్తోంది. ఈనెల 2వ తేది ఫుడ్ పాయిజన్ కావడంతో 82 మంది విద్యార్థులు ఆస్పత్రిపాలయ్యారు. శుక్రవారం రెండో సారి ఫుడ్ పాయిజన్ వల్ల దాదాపు 40 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయం విధితమే. వారిని స్థానికంగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. ప్రాతమిక చికిత్సల అనంతరం మెరుగైన వైద్యం కోసం వారిని అనంతపురం సర్వజన ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వారు ఆస్పత్రిలోనే వైద్య చికిత్సలు పొందుతున్నారు. దీనిపై భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. వంటల్లో బల్లి పడిన ఆహారం తినడం వల్లే విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని కొందరు.. లేదు కొందరు సిబ్బందే బల్లి వేశారని మరికొందరు అంటున్నారు.

సిబ్బంది ఆధిపత్య పోరు..

శింగనమల కస్తూర్బా పాఠశాలలో పనిచేస్తున్న సిబ్బంది మధ్య ఆధిపత్య పోరు నడుస్తున్నట్లు తెలుస్తోంది. కిందిస్థాయి సిబ్బంది తరచూ వాగ్వాదం, గొడవలకు దిగుతున్నారు. వారు గొడవపడే దృష్యాలు కూడా ఇటీవల సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. సిబ్బంది మధ్య తగాదాల వల్లే ఇలాంటి సంఘటనలు చోటుచేసుకుంటున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కస్తూర్బా పాఠశాలలో సిబ్బంది మధ్య విభేదాలు వల్ల విద్యార్థుల ప్రాణాలకు ప్రమాదం ఏర్పడుతుండడంపై తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా ఇంకా అధికారులు కళ్లు తెరవకపోవడంపై ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుని ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

విద్యార్థి సంఘాలపై ఎమ్మెల్యే దురుసు ప్రవర్తన

శింగనమల కెజిబిలో జరిగిన ఫుడ్ పాయిజన్‌పై వివరణ అడిగిన విద్యార్థి సంఘం నాయకుల పట్ల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి దురుసుగా ప్రవర్తించారు. ఆమె తీరును వ్యతిరేకిస్తూ ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం అర్ధరాత్రి అంబేద్కర్ విగ్రహం ఎదుట విద్యార్థి సంఘాల నాయకులు ఆందోళన చేపట్టారు. తక్షణమే విద్యార్థి సంఘాల నాయకులకు ఎమ్మెల్యే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో శనివారం నుంచి దశలవారీగా ఆందోళన కార్యక్రమాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు.

విద్యార్థి సంఘాల ఆందోళన



ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

అనంతపురం కలెక్టరేట్ : విద్యార్థి సంఘాల నాయకులను తాగుబోతులంటూ అవమాన పరచిన శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే వైఖరిని నిరసిస్తూ శనివారం విద్యార్థి సంఘాల నాయకులు అనంతపురం నగరంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు సూర్యచంద్ర యాదవ్, జిల్లా కార్యదర్శి పరమేష్, ఆంధ్రప్రదేశ్ పాఠశాలల పేరెంట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు చిన్న ఆంజనేయులు, ఐఎస్‌బి జిల్లా కార్యదర్శి పాపిరెడ్డిపల్లి పృథ్వీ, బీసీ, ఎస్టీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి బిసి సురేష్, విఎస్‌ఐవి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వినోద్ కుమార్ తదితరులు హాజరై ఆందోళన నిర్వహించారు. రెండవ పట్టణ పోలీసులు విద్యార్థి సంఘాల నాయకులను బలవంతంగా అరెస్టుచేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. అంతకుమునుపు నాయకులు మాట్లాడుతూ ఫుడ్ పాయిజన్‌తో అనారోగ్యానికి గురైన విద్యార్థినులకు మెరుగైన వైద్య చికిత్స అందించి ప్రాణాలు కాపాడాలని ఆసుపత్రికి వెళ్లిన విద్యార్థి సంఘాల నాయకులపై శింగనమల ఎమ్మెల్యే సమాధానం చెప్పలేక ఇలాంటి అవమానకరమైన వాఖ్యలు చేశారని మండిపడ్డారు. వరుసగా కెజిబివి పాఠశాలలో ఫుడ్ పాయిజన్ జరగడంపై వివరణ అడిగితే పోలీసులను అడ్డం పెట్టుకుని అవమానించడం సరికాదన్నారు. తక్షణమే ఎమ్మెల్యే క్షమాపణ చెప్పాలన్నారు. విద్యార్థులకు న్యాయ్యమైన భోజనం అందించాలని డిమాండ్ చేశారు. పాఠశాల సిబ్బందిపై చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో ఎమ్మెల్యే ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు.

సిబ్బందిని సస్పెండ్ చేయాలి

శింగనమల కెజిబివి పాఠశాలలో విద్యార్థినుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న సిబ్బందిని తక్షణమే సస్పెండ్ చేయాలని పిడిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వీరేంద్ర ప్రసాద్, ఐసా జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్ ఆలాం, విఎస్‌ఐవి రాష్ట్ర అధ్యక్షులు టిపి.రామన్న డిమాండ్ చేశారు. శనివారం టవర్‌క్లాక్ సమీపంలోని గాంధీ విగ్రహం వద్ద కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. విద్యార్థినులు విషాహారం తిని ప్రాణాపాయ స్థితిలో ఉన్నారన్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతోనే విద్యార్థులు అనారోగ్యానికి గురికావాల్సి వస్తోందన్నారు. తక్షణమే సిబ్బందిని తొలగించాలన్నారు. విద్యార్థి సంఘాల నాయకులను తాగుబోతులంటూ విమర్శించిన ఎమ్మెల్యే పద్మావతి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్ఐవి నగర అధ్యక్షులు బండారు శంకర్, ఐటిఐ కళాశాల వద్దే శివకుమార్, ఐసా కమిటీ సభ్యులు రామాంజి, విఎస్‌ఐవి కమిటీ సభ్యులు విజయేంద్ర వర్మ, మోహన్, అనిల్ పాల్గొన్నారు.



కళ్లకు గంతలుకట్టుకుని నిరసన

కుల, మతాల ఐక్యతకు చిహ్నం క్రిస్మస్

కెవిపిఎస్, సిఐటియు, ఆవాజ్ ఆధ్వర్యంలో వేడుకలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్



కేక్ కోస్తున్న కెవిపిఎస్, సిఐటియు, ఆవాజ్ నాయకులు

కుల, మతాల ఐక్యతకు చిహ్నంగా క్రిస్‌మస్ పండుగ నిలిచిందని కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప అన్నారు. క్రిస్‌మస్ పండుగను పురష్కరించుకుని శనివారం కెవిపిఎస్, సిఐటియు, ఆవాజ్ సంఘాల ఆధ్వర్యంలో క్రిస్‌మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. నగరంలోని నీలిమా సర్కిల్, తపోవనం సర్కిలలో ప్రజలతో కలిసి కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో విభిన్న మతాలు, విభిన్న భాషలు, ఆచార, వ్యవహారాలు, సాంస్కతులు కట్టుబాట్లతో భిన్నత్వంలో ఏకత్వంగా కొనసాగుతోందన్నారు. అన్ని మతాల యొక్క సారం ప్రజల ఐక్యతను పెంపొందిస్తాయని తెలిపారు. బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత మతాల మధ్య కులాల మధ్య చిచ్చు పెట్టి మత ఉన్మాదాన్ని పెంచి ఐక్యతను చీల్చి పబ్బము గడుపుకుంటోందని విమర్శించారు. ఏమి తినాలో, ఏమి మాట్లాడాలో, ఏ బట్ట కట్టాలో, ఎలా వ్యవహరించాలో ఇలా అనేక రూపాల్లో ప్రజలను భయభ్రాంతులను గురిచేస్తోందన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తూ, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతత్వంనకు వ్యతిరేకంగా హిందూత్వ రాజకీయాలు చేస్తోందని ధ్వజమెత్తారు. ఏసుక్రీస్తు ప్రజల పక్షాన ఉండి, ప్రజల కోసం తన ప్రాణాలను సైతం ఫణంగా పెట్టిన మహాయోధుడన్నారు. ప్రజలందరూ ఐక్యంగా నడవాలని అరాచకాలను ఎదిరించాలని క్రీస్తు పిలుపునిచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు వి.రామిరెడ్డి, ఆవాజ్ జిల్లా అధ్యక్షులు వలి, కెవిపిఎస్ జిల్లా వెంకటేష్, నగర నాయకులు జీవరత్నం, రాజు, సిఐటియు నాయకులు వెంకటనారాయణ, బాబు, ఆవాజ్ నాయకులు మసూద్, ఇస్మాయిల్, ఫక్ర, దాదు, రఫీ, ప్రసాద్, చాందు, దేవా, వన్నూరు, వరలక్ష్మి, వెంకటేష్, పాండు, క్రిస్టియన్ మైనార్టీ నాయకులు డేవిడ్, కష్ణవేణి, అకులప్ప తదితరులు పాల్గొన్నారు.

రాయలసీమకు సిఎం జగన్ నమ్మకద్రోహం

మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం




విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రాయలసీమ ప్రజలకిచ్చిన హామీలను తుంగలో తొక్కి నమ్మకద్రోహం చేశాడని మాజీమంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు మండిపడ్డారు. శనివారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాయలసీమలో సాగునీటి ప్రాజెక్టుల పనులను పూర్తిగా నిలిపివేసి ఈప్రాంతానికి తీరని ద్రోహం చేస్తున్నారన్నారు. కర్నూలుకు న్యాయ రాజధాని పేరిట మరోమోసానికి తెరలేపారన్నారు. ఇందులో భాగంగా జుడీషియల్ అకాడమీ ఏర్పాటు చేస్తామని నమ్మించి నయవంచనకు పాల్పడుతున్నాడని విమర్శించారు. సదరు అకాడమీని శాశ్వత ప్రాతిపదికన కర్నూలులో ఏర్పాటు చేస్తానని రెండున్నరేళ్ల క్రితం జిఓ నెం.152లో వైసిపి ప్రభుత్వం స్పష్టంగా పేర్కొందన్నారు. అయితే తాజాగా గుంటూరు జిల్లా మంగళగిరిలో జుడీషియల్ అకాడమీ ప్రారంభానికి ఏర్పాట్లు చేస్తున్నారన్నారు. ఎవరిని మోసం చేయడానికి ఇలాంటి తప్పుడు జిఓలను విడుదల చేస్తున్నావని ప్రశ్నించారు. జుడీషియల్ అకాడమీని ప్రారంభించకుండా సీమవాసుల మనసులో ముఖ్యమంత్రి జగన్ నయవంచకుడిగా చరిత్రలో నిలిచిపోతాడన్నారు. కడపలో ప్రభుత్వ రంగంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తానని చెప్పి, మూడున్నరేళ్లు గడుస్తున్నా, ఇంతవరకు ఎందుకు కనీసం ప్రహరీ నిర్మించలేదన్నారు. ఓబుళాపురం మైనింగ్ గనులను తెలంగాణ రాష్ట్రానికి చెందిన బడా పారిశ్రామికవేత్తకు అప్పజెప్పడానికి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నాయకత్వంలో కుట్రలు జరుగుతున్నాయని ఆరోపించారు. అంతేగాకుండా సీమలోనిసహజ వనరులను కూడా ఇష్టానుసారంగా దోచుకుంటున్నారన్నారు. కడప ఉక్కు పరిశ్రమను రాయలసీమవాసులు తమహక్కుగా భావిస్తున్న నేపథ్యంలో ప్రయివేట్ పరం చేయడం ద్రోహమే అవుతుందన్నారు. సిఎం జగన్ తన హామీలను తానంతట తానే ఉల్లంఘిస్తూ, అడుగడుగునా మాట తప్పుతూ, మడమ తిప్పుతున్నాడని దుయ్యబట్టారు. సిఎంగా జగన్ కొనసాగడానికి, రాజకీయాల్లో ఉండటానికి అనర్హుడు అని స్పష్టం చేశారు. జగన్‌రెడ్డికి ఏమాత్రం నైతిక విలువలు ఉన్నా వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి పురుషోత్తం, పార్టీ పట్టణ అధ్యక్షుడు నాగరాజు, జమీల్ ఖాన్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా నగర అంతర్గత రోడ్ల అభివృద్ధి

మేయర్ మొహమ్మద్ వసీం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్



పనులను ప్రారంభిస్తున్న మేయర్ వసీం

నగరంలో శరవేగంగా అంతర్గత రోడ్లు అభివృద్ధి పనులు సాగుతున్నాయని మేయర్ మహమ్మద్ వసీం అన్నారు. శనివారం నగరంలోని 48వ డివిజన్ పరిధిలో చేపట్టనున్న సిమెంట్ రోడ్డు పనులకు డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, కార్పొరేటర్ శ్రీనివాసులుతో కలిసి భూమిపూజ చేశారు. అదేవిధంగా కోవూర్‌నగర్‌లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలో సిమెంట్ రోడ్లతోపాటు డ్రెయినేజీలను ఏర్పాటు చేసి పారిశుధ్య మెరుగుకు చర్యలు చేపట్టామన్నారు. అలాగే 15వ ఆర్థిక నిధులు రూ.18.92 కోట్లతోపాటు గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం ద్వారా సచివాలయానికి వచ్చిన రూ.20 లక్షలు వెచ్చించి అభివృద్ధి పనులు చేస్తున్నట్లు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో కార్పొరేటర్లు ఇసాక్, చంద్రమోహన్, సైపులా బేగ్, అనిల్‌కుమార్‌రెడ్డి, శేఖర్‌బాబు, నాయకులు ఖాజా, రవి, వెంకటేష్, రామచంద్ర, కిషోర్, డిఇ రామ్‌ప్రసాద్‌రెడ్డి, ఎఇ శంకర్‌తోపాటు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మిద్దె శ్రీరామ్‌రెడ్డి

రాజకీయాలకతీతంగా సేవ చేస్తాం

తాడిపత్రి రూరల్ : రాజకీయాలకు అతీతంగా నిరుపేదలకు సేవ చేస్తామని మిద్దె చిన్న పుల్లారెడ్డి సేవా సమితి వ్యవస్థాపకుడు, పారిశ్రామిక వేత మిద్దె శ్రీరామ్‌రెడ్డి తెలిపారు. ఈమేరకు శనివారం మండలంలోని సజ్జలదిన్నె గ్రామంలో కావేరి సముద్రం గ్రామానికి చెందిన మిద్దె శ్రీరామ్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్మికులకు జీరో అకౌంట్ పుస్తకం, లేబర్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన తండ్రి మిద్దె చిన్న పుల్లారెడ్డి మరణానంతరం తాను సేవాసమితి ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ చిన్న పెద్దయ్య, ఆదినారాయణరెడ్డి, హనుమంతురెడ్డి పాల్గొన్నారు.

కళ్యాణమస్తు, షాదీ తోఫాకు దరఖాస్తు చేసుకోండి..

నార్పల : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వైఎస్ఆర్ కళ్యాణమస్తు, షాదీ తోఫాకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ఎంపిడిఒ దివాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లింలు, ఇతర మైనారిటీలు, వెల్ఫేర్ బోర్డులో రిజిస్టర్ అయిన కుటుంబాలకు చెందిన వివాహాలకు ఆర్థిక సాయం అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకొచ్చిందన్నారు. దరఖాస్తు చేసుకునే పెళ్లి కుమార్తెకు 18ఏళ్లు, పెళ్లికుమారునికి 21ఏళ్లు పూర్తయి ఉంటే అర్హులన్నారు. కావున అర్హులందరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పింఛన్ల తొలగింపు అన్యాయం

బుక్కరాయసముద్రం : తప్పుడు సమాచారంతో పింఛన్లు తొలగించడం అన్యాయమని డప్పు కళాకారుల సంఘం అధ్యక్షులు ఓ.నల్లప్ప శనివారం ఒక ప్రకటనలో అన్నారు. బాధితునికి సంబంధం లేని ఇంటి విద్యుత్ మీటర్ రీడింగ్‌ను కలిసి 300 యూనిట్లకు పైబడి వచ్చిదని డప్పు కళాకారులకు పింఛన్లను తొలగించేందుకు ఎసరు పెట్టడం బాధాకరమన్నారు. ఇందులో భాగంగానే మండల కేంద్రంలోని డప్పు కళాకారుడు రాకెట్ల చిన్న గంగన్నను విద్యుత్ 300 యూనిట్లు దాటుతోందని, మీకు పింఛన్ ఎందుకు తొలగించకూడదో వివరణ ఇవ్వాలని నోటీసు ఇవ్వడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ విషయంపై వాస్తవాలను పరిశీలించగా చనిపోయిన తన అన్న గంగన్న పేరుతో ఉన్న కరెంటు మీటర్‌కి తన ఆధార్ లింక్ కావడంతో తన భార్య పేరుతో ఉన్న కరెంటు మీటర్‌కు రెండిటివి కలిపి 300 యూనిట్లు వచ్చిందని తేలిందన్నారు. వాస్తవంగా పెద్ద గంగన్న, చిన్న గంగన్న అన్నదమ్ములు కావడంతో వేర్వేరు ఇళ్లలో ఉంటున్నా మీటర్‌కు ఒకే ఆధార్ కార్డుకు లింక్ కావడంతో ఈ పరిస్థితి వచ్చిందన్నారు. వెంటనే అధికారులు ఇలాంటి సమస్యలను పరిష్కరించాలనిగానీ, ఉన్న పింఛన్లను తొలగించడం ఏంటని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పింఛన్‌దారుల సమస్యలు పరిష్కరించాలిగానీ, ఉన్న పింఛన్లను తొలగించవద్దని డిమాండ్ చేశారు.

అధికార పార్టీలో అలజడి

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

వైసిపి అధికారంలోకి వచ్చి మూడున్నరేళ్లు గడుస్తోంది. ప్రారంభంలో అంతటా సవ్యంగా సాగినట్టు కనిపిస్తున్న ఆ పార్టీలో ఇప్పుడు అలజడి మొదలైంది. అసంతృప్త స్వరాలు పెరుగుతుండటం ఆ పార్టీలో గుబులు రేపుతున్నాయి. మొన్నటి వరకు వైసిపి చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలకు తిరుగులేదని చెబుతూ వచ్చిన ఆ పార్టీ నేతలే ఇప్పుడు పెదవి విరుస్తున్నారు. మూడున్నరేళ్లలో చేపట్టిన అభివృద్ధి నామమాత్రంగానే ఉందని అసంతృప్తిని ఆ పార్టీ నేతల నుంచే వ్యక్తమవుతోంది. ఇవి నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశాల్లో స్పష్టంగా కనిపించాయి. అంతకు మునుపు అనంతపురం జిల్లాలో సమీక్షలు నిర్వహించిన రాయలసీమ వైసిపి కో ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, గత వారంలో సత్యసాయి జిల్లాలో పూర్తి చేశారు. ధర్మవరం అసెంబ్లీ నియోజకవర్గం మినహా తక్కిన అన్ని చోట్ల అసంతృప్త స్వరాలు బాహాటంగానే వినిపించాయి. అధికార వైసిపి మంచి పలుకుబడివున్న అగ్రనేతల్లో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఒకరు. ఆయనంటే దిగువ స్థాయి నేతల్లోనూ భయముంది. అటువంటి ఆయన నియోజకవర్గ స్థాయి సమీక్షలు నిర్వహిస్తే అంతా క్రమశిక్షణతో నడుస్తుందని భావించారు. కాని ఆయన ఎదుటే సత్యసాయి జిల్లాలో పెద్దఎత్తున ఘర్షణలు సైతం చోటు చేసుకున్నాయి. ఈ నేతలు మాకొద్దంటూ మడకశిర, పెనుకొండ, కదిరి, పుట్టపర్తి అన్ని చోట్ల క్యాకర్తలు మండిపడటంబాహాబాహీకి దిగిన ఘటనలు చోటు చేసుకున్నారు. మరో ఏడాదిలో ఎన్నికలు ముంచుకొస్తున్న సమయంలో పార్టీ అంతర్గత విభేదాలు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఏ రకంగా చక్కదిద్దుతారన్నది చూడాల్సి ఉంది. ఒకవైపు ఎన్నికలకు సమయత్తమయ్యే పనుల్లో నాయకులు నిమగ్నమయ్యారన్నది స్పష్టమవుతోంది. అధికారపార్టీ ఇప్పటికే నియోజకవర్గ స్థాయి సమావేశాలతోపాటు, గెలుపు గుర్రాల కోసం అన్వేషణను మొదలుపెట్టిందన్న ప్రచారం రాజకీయవర్గాల్లో సాగుతోంది. ఇక ప్రతిపక్ష టిడిపి కూడా అదే స్థాయిలో దూకుడును పెంచుతోంది. ఇదేం కర్మ పేరుతో ప్రచార కార్యక్రమాలను చేపడుతోంది. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లే పనులను చేపడుతోంది. ఇక వామపక్షాలు సిపిఎం, సిపిఐలు రైతాంగ సమస్యలపై దృష్టి సారించాయి. ఈ ఏడాది పడిన అధిక వర్షాలకు దెబ్బతిన్న రైతులను ఆదుకోవాలని కోరుతూ నిరసనలు చేపడుతున్నారు. ఈ వారంలో జిల్లాలో జరిగిన మరో ప్రధానమైన అంశం ఎపి మున్సిపల్ వర్కర్సు అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర మహాసభలు అనంతపురంలో జరిగాయి. ఈ మహాసభల్లో మున్సిపల్ కార్మికులక ప్రభుత్వం ఇచ్చిన మాటను ఏ రకంగా తప్పిందన్న అంశాలపై చర్చించారు. సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు నర్సింగరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రెండు రోజుల మహాసభలో అనేక అంశాలపై తీర్మానాలు ప్రవేశపెట్టారు. ఇక ఐద్వా, ఎస్ఎఫ్ఐ, కెవిపిఎస్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన బహుజన సాంస్కృతిక ఉత్సవాలు నాలుగు రోజులపాటు జరిగాయి. ఇవి అందరినీ ఎంతో ఆలోచింపజేసే విధంగానూ, ఉత్తేజపూరితంగానూ సాగాయి. అంబేద్కర్, జ్యోతిరావుపూలే, వేమన, కందుకూరి విరేశలింగం నలుగురు మహనీయు జీవిత చరిత్రను నాటక రూపంలో చేపట్టిన ప్రదర్శనలను అందరినీ ఆకట్టుకున్నాయి.



నిరుపేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి

సిపిఎం మండల కార్యదర్శి భాస్కర్

ప్రజాశక్తి-శింగనమల

అర్హులైన నిరుపేదలందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని సిపిఎం మండల కార్యదర్శి భాస్కర్ డిమాండ్ చేశారు. ఈమేరకు మండలంలోని నిదనవాడ గ్రామంలో తహశీల్దార్ ఈశ్వరమ్మను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిదనవాడ గ్రామంలో 250 ఎస్సీ కుటుంబాలకు ఒక సెంటు భూమి లేదన్నారు. అంతేగాకుండా గ్రామంలో ఎస్సీలకు శ్మశానం కూడా లేదన్నారు. దీంతో కాలువ గట్టును మృతదేహాలను పూడ్చుకోవాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. అక్కడ కూడా స్థలం లేకపోవడంతో ఒకరి శవాన్ని బయటకు తీసి మరొకరి శవాన్ని పూడ్చాల్సి వస్తోందన్నారు. కావున వెంటనే స్పందించి శ్మశానికి స్థలం మంజూరు చేయాలని, అర్హులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, మూడెకరాల సాగుభూమి ఇవ్వాలని, తాగునీటి సౌకర్యం కల్పించాలని, డిమాండ్ చేశారు. ఆయా సమస్యలు పరిష్కరించకపోతే రానున్న రోజుల్లో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులు, పెద్దన్న, రమణారెడ్డి, నాగరాజు, లక్ష్మీపతి, చిన్న పెద్దన్న, అంజనమ్మ, దైవతము, ఎర్రిస్వామి, గంగరాజు, పెద్దన్న, లాల్‌స్వామి, ఆదెన్న, నాగరాజు, వరలక్ష్మి, పెద్దన్న, లక్ష్మీనారాయణ, ఆదినారాయణ, నాగముని, ఈరన్న గోల్కొండ, రామ్మోహన, రాము, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.


తహశీల్దార్ ఈశ్వరమ్మకు వినతిపత్రం సమర్పిస్తున్న సిపిఎం మండల కార్యదర్శి భాస్కర్, పేదలు


ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడుతున్న అధికారులు

త్వరగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

ప్రజాశక్తి-ఆత్మకూరు

లబ్ధిదారులు త్వరగా ఇళ్లునిర్మించుకునే విధంగా చర్యలు తీసుకోవాలని మండల పరిషత్ అభివద్ధి అధికారి ఎస్.జమీల్‌అహమ్మద్ సంబంధిత అధికారులకు సూచించారు. శనివారం మండలంలోని తోపుదుర్తి, రంగంపేట గ్రామాల్లో జగనన్న లేఅవుట్లలో ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, గృహ నిర్మాణ లబ్ధిదారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారులకు అవగాహన కల్పించి ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో తోపుదుర్తి సర్పంచి ఓబులేసు, ఎంపిటిసి ఎం.కొండన్న, ఎఇ హౌసింగ్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ హరి , ఎపిఒ బి.పుష్ప, ఎపిఎం మదన్మోహన్, తోపుదుర్తి సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

రాతిదూలం లాగుడు పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-ఆత్మకూరు

మండలంలోని పి.యాలేరు గ్రామంలో ఏర్పాటు చేసిన రాతిదూలం లాగుడు పోటీలను ఆంథోన్‌రెడ్డి, శ్రీలతారెడ్డి శనివారం ప్రారంభించారు. క్రిస్మస్ వేడుకల్లో భాగంగా రాతిదూలం లాగుడు పోటీలను ప్రారంభించినట్లు తెలిపారు. విజేత ఎద్దుల యజమానులకు మొదటి బహుమతి రూ.లక్ష, 2వ బహుమతి రూ.90వేలు, మూడవ బహుమతి రూ.80వేలు, నాలుగవ బహుమతి 70వేలు, ఐదవ బహుమతి రూ.60వేలు, ఆరవ బహుమతి రూ.50వేలు, ఏడవ బహుమతి రూ.40వేలు, ఎనిమిదవ బహుమతి రూ.30వేలు అందజేయనున్నట్లు తెలిపారు. నేడు క్రిస్మస్‌ను పురస్కరించుకుని విజేతల యజమానులకు బహుతులు అందజేయనున్నట్లు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సిఐ మోహన్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి ఆరోగ్యం రెడ్డి, వైస్ ఎంపిపి నీలిమారెడ్డి, ఫణి రెడ్డి, వాసుదేవరెడ్డి, బాలు, పోతన్న, అతికిరెడ్డి, ముత్యాలు, తదితరులు పాల్గొన్నారు.


రాతిదూలం లాగుడు పోటీలను ప్రారంభిస్తున్న శ్రీలతారెడ్డి

'శ్రీచైతన్య'లో క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-అనంతపురం

స్థానిక కోర్టు రోడ్డులోని శ్రీ చైతన్య పాఠశాలలో శనివారం క్రిస్మస్ సంబరాలు జరుపుకున్నారు. ఎజిఎం సుబ్బారెడ్డి కేక్ కట్‌చేసి క్రిస్మస్ సంబరాలకు ఆహ్వానం పలికారు. ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది జరుపుకునే మతపరమైన సాంస్కృతిక పండుగ క్రిస్మస్ అన్నారు. ప్రపంచ మానవాళి కోసం రక్తాన్ని చిందించిన గొప్ప మహనీయుడు జీసస్ క్రైస్ట్ అని తెలిపారు. పిల్లల క్రిస్మస్‌తాత, దేవదూతల వేషధారణలతో పాఠశాల ప్రాంగణం కోలాహలంగా, సందడిగా కనిపించింది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తబస్సుం, కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, పూజ, డీన్లు రిషిబాల, అప్పలనాయుడు ఏవో గోపాల్, ప్రైమరీ ఇన్‌ఛార్జి నీరజ, భారతి, ప్రీ ప్రైమరీ ఇన్‌ఛార్జి కరుణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే ఆదిమూర్తి నగర్‌లో ఉన్న శ్రీచైతన్య పాఠశాలలో కూడా క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. ఇందులో భాగంగా ఎజిఎం సుబ్బారెడ్డి క్రీస్తు జీవిత చరిత్రను వివరించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన శాంతక్లాజ్, మరియమ్మ, దేవదూతల వేషధారణలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శాంత, డీన్ గంగాధర్, ప్రైమరి ఇన్‌ఛార్జి చంద్రకళ, ప్రీప్రైమరీ ఇన్‌ఛార్జి జ్యోతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే బస్టాండ్ సమీపంలోని ఎటిపి-7 శ్రీచైతన్య ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ పర్వీన్, డీన్ చంద్రమోహన్, తదితరులు పాల్గొన్నారు.


క్రిస్మస్ సంబరాల్లో పాల్గొన్న విద్యార్థినీ, విద్యార్థులు

ఉల్లాసంగా ఫ్రెషర్స్ డే

గుంతకల్లు : పట్టణంలోని ఎఫ్‌సిఐ గోదాము వద్ద ఉన్న శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్‌డేను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థుల సాంస్కృతి కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా కరస్పాండెంట్ లక్ష్మీనారాయణ, అధ్యక్షుడు అల్లిపీరా మాట్లాడుతూ సీనియర్, జూనియర్ విద్యార్థులు స్నేహభవంతో మెలగా లన్నారు. అంతేగాకుండా చదువులో పోటీతత్వాన్ని కలిగి ఉండాలన్నారు. అనంతరం నూతన విద్యార్థులకు సీనియర్ విద్యార్థులు సాదరంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో రిటైర్డు తెలుగు అధ్యాపకులు రామశేషయ్య, ప్రిన్సిపాల్ సి.చంద్రకళ, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పెన్నోబిలేసుడిని దర్శించుకున్న రాష్ట్ర సమాచార శాఖ కమిషనర్

ఉరవకొండ : మండల పరిధిలోని పెన్నహోబిలంలో వెలిసిన ప్రసిద్ధ లక్ష్మీనరసింహస్వామిని రాష్ట్ర సమాచార శాఖ కమిషనర్ కాకర్ల చెన్నారెడ్డి శనివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారికి ఆలయ ఇఒ విజయ్‌కుమార్, ప్రధాన అర్చకులు ద్వారకానాథ్‌స్వామి, బాలాజీస్వామి, తదితరులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. వీరితోపాటు తహశీల్దార్ బ్రహ్మయ్య, దేవాదాయ శాఖ ఇన్స్‌పెక్టర్ లక్ష్మీనారాయణ, దేవాదాయ శాఖ అధికారి రామాంజనేయులు, ఆలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ నర్సింగప్ప

చోరీ కేసులో నిందితుల అరెస్టు

24 తులాల బంగారం, రూ.5 వేల నగదు స్వాధీనం

ఉరవకొండ : విడపనకల్లు మండలం హవలిగి గ్రామంలో ఈనెల 10న జరిగిన చోరీ కేసులో ఇద్దరిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ నర్సింగప్ప తెలిపారు. శనివారం పట్టణంలోని రూరల్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 10న విడపనకల్లు మండల పరిధిలోని ఆవలి గ్రామంలో తాళం వేసిన ఇంట్లో అదే గ్రామానికి చెందిన తురాయి వన్నూరు స్వామి, భూమా వన్నూరుస్వామి కలిసి బీరువా పగలగొట్టి 24 తులాల బంగారు, రూ.5వేల నగదు ఎత్తుకెళ్లారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తుండగా నిందితులు శనివారం ఉదయం దొంగలించిన నగలను బళ్లారికి తీసుకెళ్లి అమ్ముకుందామని మండల పరిధిలోనే కరకముక్కల గ్రామం దగ్గరలో ఉన్న తిమ్మప్ప కొండ వద్ద ఉండగా నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఈమేరకు కేసును ఛేదించిన ఉరవకొండ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ శేఖర్, పాల్తూరు ఎస్ రామచంద్రయ్య, సిబ్బందిని అభినందించారు.

కూరగాయల గోదాంలో అగ్నిప్రమాదం

రూ.8 లక్షలు నష్టం

గుత్తి : పట్టణంలోని గుత్తి ఫోర్ట్ రైల్వేస్టేషన్ ఎదురుగా నూతనంగా నిర్మించిన కూరగాయల గోదాంలో శనివారం అగ్ని ప్రమాదం సంభవించింది. పట్టణానికి చెందిన శేఖర్ కూరగాయల గోదాం ఏర్పాటు చేసుకుని అక్కడే కుటుంబ సభ్యులతో నివాసం ఉండేవాడు. గోదాంలో ఉల్లిగడ్డలు, బంగాళాదుంపలను నిల్వ ఉంచాడు. ఈనేపథ్యంలో గోదాం సమీపంలోని భూముల్లో ఉన్న గడ్డికి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించారు. ఆ మంటలు గోదాంకు వ్యాపించి అందులో నిల్వ ఉన్న ఉల్లిగడ్డలు, బంగాళదుంపలు దగ్ధమయ్యాయి. అలాగే నివాసంలోని నిత్యాసర వస్తువులు అగ్నికి దహనమయ్యాయి. దీంతో రూ.8 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితులు వాపోయారు.


అగ్నికి ఆహుతవుతున్న దుకాణం

తల్లిదండ్రులపై కుమారుడి దాడి..

గుత్తి : కన్న తల్లిదండ్రులపై కుమారుడు రోకలిబండతో దాడి చేసిన ఘటన శనివారం పట్టణంలో శనివారం చోటు చేసుకుంది. కర్నూలు రోడ్డులో నివాసం ఉండే నారాయణస్వామి, ఇందిరా శోభావాణి దంపతుల కుమారుడు రామకృష్ణ ఆస్తి పంపకాలపై తగాదా పడ్డాడు. ఈనేపథ్యంలో ఇంట్లో ఉన్న రోకలిబండతో తల్లిదండ్రుల తలలపై బాధాడు. దీంతో తీవ్రంగా గాయపడ్డ వారిని స్థానికులు చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం క్షతగాత్రులను అనంతపురం ఆస్పత్రికి తీసుకెళ్లారు.

చర్చిల వద్ద పారిశుధ్యంపై దృష్టి సారించాలి : మేయర్ వసీం


చర్చి వద్ద పారిశుధ్యం పనులు చేస్తున్న కార్మికులు

అనంతపురం కార్పొరేషన్ : నగరంలోని అన్ని చర్చిల వద్ద పారిశుధ్యంపై దృష్టి సారించాలని మేయర్ మహమ్మద్ వసీం సూచించారు. శనివారం నగరంలోని అరవింద్‌నగర్ సిఎస్ఐ చర్చిని అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రిస్మస్ వేడుకలను పురస్కరించుకుని వేడుకలకు పెద్ద ఎత్తున క్రిస్టియన్ సోదరులు హాజరు కానున్నందున చర్చిల వద్ద పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కమల్‌భూషణ్, నాయకులు సునీల్, ఖాజా, రియాజ్, శీనా, నగరపాలక సంస్థ కార్యదర్శి సంగం శ్రీనివాసులు, ఎంహెచ్ఒ గంగాధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగం

బొమ్మనహాల్ : మండలంలోని మల్లన్న గుడ్డం గ్రామంలో రైతు ప్రభాకర్ బోరుబావి కింద సాగు చేసిన వరి పంటలో అధికారులు శనివారం పంటకోత ప్రయోగం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు రెండు మీటర్లు పొడవు, రెండు మీటర్లు వెడల్పులో పంటను కోత కోసి తూకాలు వేయగా 23 కిలోల దిగుబడి వచ్చిందన్నారు. ఈ ప్రకారంగా ఎకరాకు దాదాపు 27 బస్తాలు దిగుబడి వచ్చినట్లు తెలిపారు. గతేడాదితో పోలిస్తే ఈసారి దిగుబడి పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ఇన్‌ఛార్జి ఎస్ఒ పర్వతప్ప, ఎంపిఇఒ రాజ్యలక్ష్మి, విఆర్ఒ ప్రేమ్ పోతురాజు, రైతులు పాల్గొన్నారు.

రబీ పంటలకు ఈక్రాప్ బుకింగ్ తప్పనిసరి

బ్రహ్మసముద్రం : మండల వ్యాప్తంగా రబీ సీజన్‌లో రైతులు సాగు చేసిన పంటలకు తప్పనిసరిగా ఈక్రాప్ బుకింగ్ చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారిణి సరిత సూచించారు. శనివారం మండల పరిధిలోనే బ్రహ్మసముద్రం, మాముడూరు, సంతే కొండాపురం, తదితర గ్రామాల్లో చేపట్టిన ఈక్రాప్ బుకింగ్‌ను ఆమె పర్యక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలవ్యాప్తంగా ఇప్పటివరకు ఈక్రాప్ బుకింగ్ చేయించుకోని రైతులు దాదాపు 3420 మంది ఉన్నారన్నారు. వీరందరూ తప్పకుండా ఈక్రాప్ బుకింగ్ చేయించుకుని రాయితీలు పొందాలని సూచించారు. అలాగే జనవరిలో పీఎం కిసాన్ సొమ్ము రూ.2వేలు పొందాలంటే తప్పక ఈక్రాప్ బుకింగ్ చేయించుకోవాలన్నారు. ఆమె వెంట ఆయా గ్రామాల వీహెచ్‌ఏలు, ఎంపీఈవోలు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ఒక్క అవకాశం ఇస్తే.. ప్రజలను కష్టాల్లోకి నెట్టారు..

మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌చౌదరి

అనంతపురం కలెక్టరేట్ : ఒక్క అవకాశం ఇవ్వండి రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తానంటూ నమ్మించి అధికారం చేపట్టిన ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మూడేళ్ల పాలనలో ప్రజలు మోయలేని భారాలు మోపి కష్టాల్లోకి నెట్టివేశారని మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్‌చౌదరి అన్నారు. శనివారం టిడిపి ఆధ్వర్యంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నారాయణపురంలో నిర్వహించారు. టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు డిష్.నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి హాజరై ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంచుతూ ప్రభుత్వ విధానాలపై వివరించారు. ప్రజల ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నారాయణపురం పంచాయతీ పరిధిలోని తపోవనంలో నిర్వహించిన కార్యక్రమానికి ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి స్వాగతం పలికారు. ప్రభత్వంతో పడుతున్న ఇబ్బందులు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని, ప్రజల అన్ని సమస్యలు పరిష్కరిస్తామని హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నగర అధ్యక్షుడు మారుతి కుమార్ గౌడ్, మాజీ డిప్యూటీ మేయర్ సాకే గంపన్న, రాష్ట్ర కార్యదర్సులు ఆదినారాయణ, దేవర్లమురళి, జిల్లా అధికార ప్రతినిధి సరిపూటి రమణ, నారాయణస్వామి యాదవ్, జిల్లా మైనారిటీ అధ్యక్షుడు సాలార్ బాష, జిల్లా టియన్‌టియుసి అధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్, రాష్ట్ర కురబయాదవసమన్వయ కర్త శివబాల, కూచి హరి, రాష్ట్ర నాయకులు స్వప్న, నగర అధ్యక్షురాలు విజయ శ్రీ రెడ్డి, సంగా తేజస్వీణీ, గుర్రం నాగభూషణ, మేకా షణ్ముఖ, ముక్తియార్, గోపాల్‌గౌడ్, లక్ష్మిప్రసాద్, బోమ్మినేని శివ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడొద్దు..

టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండారు శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-శింగనమల

శింగనమల మండల కేంద్రంలోని కస్తూరిబా పాఠశాలలో ఇటీవల కలుషిత ఆహారం తిని 87 మంది విద్యార్థులు ఆసుపత్రి పాలైన ఘటన మరువకముందే రెండోసారి విద్యార్థులు అస్వస్థకు గురికావడం బాధాకరమని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి బండారు శ్రావణిశ్రీ అన్నారు. ఈమేరకు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొన్న జరిగిన ఘటనకు స్పందించిన జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకుంటామని చెప్పి నెల గడవక ముందే అదే పాఠశాలలో మరోసారి చోటు చేసుకోవడం వారి నిర్లక్ష్యానికి అద్దం పడుతోందన్నారు. విద్యార్థులకు రక్షణ కల్పించడంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పూర్తిగా విఫలమయ్యారన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారుల నిర్లక్ష్యం వల్ల విద్యార్థులు ప్రాణాలను ఫణంగా పెట్టి చదువుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోందన్నారు. వెంటనే బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్‌చేశారు. లేనిపక్షంలో రానున్న రోజుల్లో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు చిదానందనాయుడు, చితంబరిదొర, తదితర నాయకులు పాల్గొన్నారు. అలాగే శింగనమల మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ గురుకుల విద్యాలయంలో నెలకొన్న వర్గకక్షలపై చర్యలు తీసుకుని విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాలని ఎంఆర్‌పిఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు పాఠశాల తనిఖీకి వచ్చిన గర్ల్స్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (జిసిడిఒ) రబికకు ఎంఆర్‌పిఎస్ నాయకులు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నెలరోజుల వ్యవధిలోనే రెండుసార్లు విద్యార్థినులు అస్వస్థకు గురికావడం బాధాకరమన్నారు. విద్యాలయంలో వర్గకక్షలతో విద్యార్థినులతో చెలగాటమాడుతున్న వంట మనుషులు, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు అక్కులప్ప మాదిగ, ఉపాధ్యక్షులు తిమ్మంపల్లి వెంకటేశులు, సంపత్‌కుమార్, ఎస్సీ, ఎస్టీ అడ్వకేట్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెన్నే ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం : శింగనమల మండల కేంద్రంలోని కెజిబివిలో ఫుడ్ ఫాయిజన్ కావడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను శనివారం జనసేన నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా జనసేన జిల్లా ఉపాధ్యక్షులు అంకె ఈశ్వరయ్య, జిల్లా కార్యదర్శి చొప్పా చంద్రశేఖర్ మాట్లాడుతూ ఫుడ్ పాయిజన్‌కు గురై 20 మంది విద్యార్థులు అస్వస్థకు గురికావడం బాధాకరమన్నారు. వెంటనే వైద్యులు మెరుగైన చికిత్స అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ సంయుక్త కార్యదర్శి అవుకు విజయ్, ముప్పూరి కృష్ణ, పురుషోత్తంరెడ్డి, క్రిష్ణమూర్తి, అనంతపురం నగర ఉపాధ్యక్షులు జెక్కిరెడ్డి ఆదినారాయణ, శింగనమల మండల అధ్యక్షులు తోట ఓబులేసు, నగర కార్యదర్శి హరీష్‌రాయల్, జనసేన నాయకులు సిర్రప్పగారి భాస్కర్, అజయ్, నవీన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థినులను పరామర్శిస్తున్న టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండారు శ్రావణిశ్రీ